క్లుప్తంగా

సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ



సరస్వతి దేవి విగ్రహం ఆవిష్కరించిన నాయకులు

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో ఐ పురుషోత్తం మాట్లాడుతూ స్కూల్ ప్రాంగణలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుతో విద్యార్థుల్లో చదువుల పట్ల స్ఫూర్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టు భద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు, ఏ నాగవీరభద్రాచారి, విశ్వేశ్వరరావు, నున్నా శివ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చేయూత



సామగ్రి అందజేస్తున్న క్లబ్ సభ్యులు, దాతలు

అద్దంకి: విద్యాభివృద్ధికి చేయూతనిచ్చేందుకు రోటరీ కృషిచేస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ అన్నారు. ఆయన ఆదివారం శింగరకొండ సమీపంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీనిలో భాగంగా వీ జశ్వంత్ చౌదరి తండ్రి అనీల్ కుమార్ అందజేసిన పేపర్ సామగ్రి, 500 పెన్నులు, రూ.12000 విలువ చేసే వాటర్ పైపులు కళాశాల అవసరాలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గా గాయత్రి, రోటరీ రోటేరియన్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టాయిలెట్స్ డే



దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ టాయిలెట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో టాయిలెట్స్ క్లీనింగ్ మెటీరియల్, కార్మికులకు బట్టలు, వంట సామగ్రి, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బీ సదానంద రెడ్డి, సభ్యులు జీ శ్రీనివాసరావు, ఆకుల వెంకటేశ్వరరావు, క్లబ్ సిబ్బంది అద్దగడ శివరామకృష్ణ పాల్గొన్నారు.

మండల యూటీఎఫ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

మార్టూరు: మార్టూరు మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎంపిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సమావేశం హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా బందారు ఆదినారాయణ, పోకూరి సునీల్ కుమార్, ఉపాధ్యక్షులుగా జీ యోహోషువా, ఏ అన్నపూర్ణాదేవిలు కోశాధికారిగా అట్లూరి ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, గౌరవాధ్యక్షుడిగా బొప్పూడి ప్రతాప్‌తో పాటు ఏడుగురు కార్యదర్శులు, 9 మంది జిల్లా కౌన్సిలర్‌లు నూతన కమిటీగా ప్రమాణ స్వీకారం చేశారు.

ఆశల సాగు..

- ఇప్పటికే విత్తనాలను పంపిణీ చేసిన వ్యవసాయ శాఖ
- మాగాణి లేకపోవడంతో పెరగనున్న సాగు
- ఈఏడాది 19,900 ఎకరాల్లో సాగయ్యే అవకాశం
- విత్తడానికి సిద్ధమవుతున్న రైతన్న



శనగ సాగుకు సిద్ధం చేసిన భూములు



జే పంగులూరు మండలంలో సాగుకు సిద్ధం చేసిన పొలం

అద్దంకి: వర్షాభావ పరిస్థితుల్లో రైతన్నలు దిగాలు పడిపోయారు. సరిగా ఈసమయంలోనే వారం క్రితం కురిసిన వర్షాలకు రైతన్నల కళ్లల్లో ఆనందం కనపడింది. రబీ సీజన్‌లో అత్యధికంగా సాగయ్యే శనగను నాటడానికి రైతులు సిద్ధం అయ్యారు. ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయశాఖ రాయితీపై 2,385 క్వాంటాళ్ల శగన విత్తనాలను ఇప్పటికే పంపిణీ చేసింది. వరుణుడు కరుణించి వర్షాలు కురిపిస్తాడా? ఈఏడాది ఇక సాగు లేనట్లే అని అశలు వదులుకున్న రైతులను వరుణుడు కరుణించాడు. మంచి వర్షాలు కురవడంతో శనగ సాగుకు మార్గం సుగమం అయింది. మరో వారం నుంచి పది రోజుల్లో పొలాల్లో రైతులు శనగ పంటను విత్తనున్నారు.

పెరగనున్న సాగు విస్తీర్ణం..

ఏటా మాదిరిగా ఈఏడాది సాగర్ కాలువ లేక మెట్ట భూములతోపాటు, మాగాణి భూముల్లోనూ శనగ సాగు చేసేందుకు రైతులు సిద్ధం అయ్యారు. దీంతో ప్రతి ఏడాది 12,800 ఎకరాల్లో పప్పు శనగ సాగు చేయగా, ఈఏడాది 19,900 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతో శనగ సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది. ఈఏడాది వ్యవసాయ శాఖ ఆయా గ్రామాల ఆర్బీకేల నుంచి అద్దంకి, జే పంగులూరు, బల్లికురవ, కొరిశపాడు, సంతమాగులూరు మండలాల్లోని రైతులకు రాయితీపై ఎకరాకు 40 కిలోల వంతున, 2,385 క్వింటాళ్ల శనగ విత్తనాలను పంపిణీ చేసింది. నాగేటి దుక్కులు దున్ని సిద్ధం చేసి పెట్టుకున్న పొలంలో వర్షం పడితే గొర్రు తోలి, విత్తేందుకు రైతులు సిద్ధమయ్యారు.

90 రోజుల్లో పంట..

వాతావరణం అనుకూలించి శగన పంటను విత్తన 90 నుంచి 95 రోజుల్లో పంట చేతికొస్తుంది. మొదట్లో వర్షం పడితే చాలు. తరువాత వర్షం లేకున్నా పండుతుంది. నాలుగైదు బస్తాల కాంప్లెక్స్ ఎరువు, రెండు మూడు సార్లు పురుగు మందు పిచికారీ చేస్తే సరిపోతుంది. ఎకరాకు గరిష్టంగా 15 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడినిస్తుంది. మన ప్రాంతంలో సాగు చేసే కాక్-2 రకం ప్రస్తుత ధర నిలిస్తే ఎకరాకు పెట్టుబడులు పోను రూ. 40 నుంచి రూ.80 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైతులు, వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు.

నియోజకవర్గంలో పప్పుశనగ సాగు వివరాలు

మండలం	పంపిణీ చేసిన శనగలు	గతేడాది సాగు విస్తీర్ణం	ఈఏడాది విస్తీర్ణం (అంచనా)
అద్దంకి	500	1000	2500
బల్లికురవ	160	400	500
కొరిశపాడు	650	5500	8500
జే పంగులూరు	900	5500	6900
సంతమాగులూరు	175	400	1500

> **పెరగనున్న శనగసాగు..**
> సాగరు కాలువలో నీరు లేకపోవడంతో మాగాణి రైతు శనగవైపు మొగ్గు చూపాడు. దాంతో శనగ విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. వర్షాలు బాగా పడటంతో మరో పది పదిహేను రోజుల్లో విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది.
> – కొర్రపాటి వెంకటకృష్ణ, అద్దంకి మండల, వ్యవసాయాధికారి

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



చీరాలలో ఇందిరాగాంధీ జయంతి నిర్వహిస్తున్న మహిళలు



అద్దంకిలో ఇందిర గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అతిథులు



పర్చూరులో ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న మహిళలు

- ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

చినగంజాం: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ అశహరి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు, మహిళలు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. రాజుబంగారుపాలెం హైస్కూల్‌లో మహిళా పోలీసులు కుమారి, రజిని పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం రంగని శ్రీనివాసరెడ్డి, ఆర్ పోతురాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

☛ పర్చూరు బాలికోన్నత పాఠశాలలో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించి బాలికలకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అశ్విని, లైబ్రేరియన్ జీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

ఇందిరాగాంధీ సేవలు స్ఫూర్తిదాయకం..

అద్దంకి/బల్లికురవ: దేశ ప్రధానిగా పనిచేసిన ధీర వనిత ఇందిరా గాంధీ సేవలు మరువలేనివని లైబ్రేరియన్ విజయభాస్కరరెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవంలో భాగంగా ఆయన స్థానిక గ్రంథాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎండీ అల్తాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

☛ ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని బల్లికురవ శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ ఏ రమేశ్ బాబు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆరో రోజు మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

చీరాల అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ సుబ్బారావు, లైబ్రేరియన్ డి.ధనమ్మ, క్లబ్ సభ్యులు సుభాషిణి, రూపాదేవి, హరిప్రసాద్, పవని భాను చంద్రమూర్తి, చుండూరి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్ కోసం బిగ్ స్క్రీన్ ఏర్పాటు



పెదగంజాంలో క్రికెట్ చూస్తున్న జనం



అద్దంకిలో మ్యాచ్ చూస్తున్న అభిమానులు



చీరాలలో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్

చినగంజాం: ఇండియా, ఆస్ట్రేలియాల మధ్య ఆదివారం నిర్వహించిన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను అభిమానులు తిలకించేందుకు మండలంలోని పెదగంజాం గ్రామంలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి మండలంలోని పెదగంజాంలోని పోలేరమ్మ గుడి వద్ద విశాలమైన ప్రాంగణంలో స్క్రీన్ ఏర్పాటు చేశారు.

చీరాల అర్బన్: ఉత్కంఠగా సాగిన ఇండియా ఆస్ట్రేలియా మధ్య వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను పెద్ద స్క్రీన్‌లో తిలకించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. చివరకు ఇండియా మ్యాచ్ ఓడిపోవడంతో అభిమానులు నిరాశ చెందారు.

అద్దంకి రూరల్: అద్దంకి జూనియర్ కాలేజీలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలి



కుందేరు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి



వేటపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

- ఎమ్మెల్యే కరణం

వేటపాలెం: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సూచించారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని కొణిజేటి చేనేతపురి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. బైపాస్ రోడ్డు వద్ద గల రక్షిత మంచినీటి పథకం పంప్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం బైపాస్ కూడల్లో నూతనంగా నిర్మిస్తున్న బస్‌షెల్టర్ పనులను పరిశీలించి అధికారులకు పలుసూచనలు ఇచ్చారు. వీరి వెంట ఎంపీడీఓ కే నేతాజీ, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఏఈ కాలేషా, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

చీరాల: కుందేరు అభివృద్ధి పనులల్లో భాగంగా చీరాల నుంచి వేటపాలెం వరకు ఉన్న కుందేరు బ్రిడ్జిలు, కుందేరులో పూడిక తీత పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. అలానే కుందేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, జమ్ము తొలిగింపు చర్యలపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పి.ధనుంజయ, దొనెంపూడి తిమోతి, ఎంపీడీవో నేతాజీ, డ్రైనేజీ డిఈ సుబ్బారావు, ఏఈలు కాలేషా, రామకుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చురకుగా అభివృద్ధి పనులు



వల్లాపల్లిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు



అభివృద్ధి పరచిన షాదీఖానా

- వల్లాపల్లిలో రూ.35 లక్షలతో అభివృద్ధి పనులు

బల్లికురవ: మండలంలోని వల్లాపల్లి గ్రామంలో రూ.35 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయి. గ్రామ సర్పంచ్ మందా మోహనరావు సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, ఆధ్వర్యంలో ఇటీవల బాపట్ల ఎంపీ నందిగం సరేష్‌కు గ్రామాభివృద్ధికి చేయూతనివ్వాలని విన్నవించారు. రెండు దఫాల్లో రూ.30 లక్షల నిధులను కేటాయించారు. ఈ నిధులతో ఎస్సీ, ఓసీ, బీసీ కాలనీల్లో 300 మీటర్ల రోడ్ల వెంట సైడు కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. పంచాయతీ రాజ్ ఏఈ, జీ హనుమంతరావు, పర్యవేక్షణలో పనులు చురుకుగా సాగుతున్నాయి. అసంపూర్తి పనులతో వినియోగంలో లేని ముస్లిం షాదీఖానాకు జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈనిధులతో ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ తుదిదశ పనులు పూర్తయ్యాయి. వినియోగంలో లేని షాదీఖానా పూర్తి వసతులతో వినియోగంలోకి తెచ్చినందుకు సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడికి ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తమకు సహకారం అందించిన రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యకు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డికి సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు.

కోటి సోమవారం పుణ్యప్రదం



పేరాల మదనగోపాలస్వామి దేవాలయంలో నిర్వహించిన కోటి దీపోత్సవం



తిమ్మాయిపాలెం శివాలయంలో దీపాలు వెలిగించిన భక్తులు

- నందీశ్వరుడికి అభిషేకాలు

బల్లికురవ: శ్రవణా నక్షత్రం కోటి సోమవారం సందర్భంగా పరమ శివుడి వాహనమైన నందీశ్వరుడికి ఆదివారం ఆలయాల్లో అభిషేకాలు చేశారు. చెన్నుపల్లి గంగాపార్వతీ సమేత పరుశవేదీశ్వరస్వామి, కొండాయపాలెం గ్రామంలోని గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి, ముక్తేశ్వరంలోని ముక్తి లింగేశ్వరస్వామి, కొణిదెనలోని భవానీ సమేత శంకరస్వామి, రామలింగేశ్వరస్వామి, అంబడిపూడి పార్వతీ మహేశ్వరస్వామి ఆలయాల్లోని నందీశ్వరులకు పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు.

అద్దంకిలో..

అద్దంకి: కార్తీక మాసంలో కోటి సోమవారాల ఫలితాన్నిచ్చే కోటి సోమవారం ఆదివారం రావడంతో భక్తులు తెలవారుజామునే నిద్ర లేచి స్నానాలు ఆచరించి శివాలయాల్లో కార్తీక దీపాలు పెట్టారు. దీనిలో భాగంగా పట్టణంలోని పాత శివాలయం, కమతేశ్వరాలయం, నగరేశ్వరాలయం, ప్రముఖ పుణ్యక్షేత్రమైన మణికేశ్వరంలోని మల్లీశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. కార్తీక దీపాలతో తమ పాపాలు తొలగాలని శివుడి వేడుకున్నారు. ఆయా దేవాలయాల్లో అర్చకులు స్వామివారికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణతో అమ్మవారు, అయ్యవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఘనంగా కోటి దీపోత్సవం

చీరాల అర్బన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి పేరాలలోని మదనగోపాల స్వామి దేవాలయంలో కార్తీక కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు రావులకొల్లు పరాంకుశం వెంకటరంగాచార్యులు, చెన్నకృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు దేవాలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. అలానే ఆదివారం కోటి సోమవారాలు కావడంతో శివాలయాలలో భక్తుల రద్దీ ఎక్కువైంది. భక్తులు ఉదయాన్నే దేవాలయానికి వచ్చి కార్తీక దీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు.

అంతా పచ్చదనమే..!



కారంచేడు ప్రాంతంలో పచ్చని వరి పొలాలు



స్వర్ణ-చీరాల రోడ్డులో పచ్చగా దర్శనమిస్తున్న వరి పొలాలు

కారంచేడు: ఓ సినిమాలో 'భూమికి పచ్చాని రంగేసినట్టు' అని కవి రాసిన పాటకు అనువుగా కారంచేడులో సాగు భూములు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల సాగు చేసిన వరి చేలల్లో పంటలను కాపాడుకోవడానికి అన్నదాతలు నానా అవస్థలు పడ్డారు. వర్షాలు కురవకపోవడంతో, కొమ్మమూరు కాలువలో సాగు నీరు అడుగంటి పోవడంతో వరి పొలాలు బెట్టకు వచ్చే తరుణంలో అన్నదాతలు ఆయిల్ ఇంజన్ను ఆశ్రయించారు. సరిగా అదే సమయంలో ప్రకృతి కరుణించింది.. వానదేవుడు వర్షించాడు.. దీంతో వరి చేలు పచ్చని ఆకు పచ్చని చీరను కట్టుకున్న భూదేవిలా ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. వాడరేవు-పిడుగురాళ్ళ ప్రధాన రహదారిలో కారంచేడు-చీరాల మధ్య వరి చేలు, ఆదిపూడి-స్వర్ణ-కారంచేడు మధ్య ఉన్న వరి చేలు, కారంచేడు-కుంకలమర్రు గ్రామాల మధ్య ఆహ్లాదంగా ఉన్నాయి. వీటి వద్ద ప్రయాణికులు సైతం సెల్ఫీలు దిగుతూ సంబరపడుతున్నారు. కాలువల్లో నీటి ప్రవాహం ఉండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కారంచేడుతో పాటు, కుంకలమర్రు, స్వర్ణ, ఆదిపూడి, రంగప్పనాయుడువారిపాలెం, నందిగుంటపాలెం ప్రాంతాల్లో ఎక్కువగా వరి సాగు చేస్తారు. ఈ ఏడాది వరి సాగు కొంత ఆలస్యం అయినా రైతులు ఇప్పటికీ వరి సాగు చేస్తూనే ఉన్నారు. వరుణ దేవుడు కరుణించకపోతాడా అనే ధైర్యంతో కర్షకులు కదం తొక్కుతున్నారు.

కులగణన సర్వేపై శిక్షణ తరగతులు

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేపై సిబ్బందికి అవసరమైన శిక్షణనిస్తున్నట్లు ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే శిక్షణ తరగతుల్లో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సిబ్బందికి శిక్షణనిస్తామన్నారు. 21న కారంచేడు-1,2,3, కుంకలమర్రు-1,2, ఆదిపూడి సచివాలయాల సిబ్బందికి, 22న స్వర్ణ-1,2, జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం, దగ్గుబాడు, తిమిడెదపాడు సచివాలయాల సిబ్బందికి శిక్షణనిస్తామన్నారు. తహశీల్దారు అరుణ, డీటీ సుశీల, ఈఓపీఆర్డీ రమేష్‌బాబుల ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు.

చదువు మన లక్ష్యాన్ని నెరవేరుస్తుంది



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రజనీశ్రీనివాసరావు

కారంచేడు: చదువు ప్రతి ఒక్కరి జీవితంలో ప్రధాన పాత్ర పోషించి మన గమ్యం, మన లక్ష్యాన్ని నెరవేర్చేలా సమర్థవంతంగా పనిచేస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రం కారంచేడు గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. లైబ్రేరియన్ నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

బల్లికురవ: ప్రభుత్వం సీపీఎస్ రద్దుతోపాటు ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించాలని బాపట్ల జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ నూతన బాడీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కే శ్రీకాంత్, అధ్యక్షురాలిగా కే అంనతలక్ష్మి, సహ అధ్యక్షులుగా ఎం వెంకటేశ్వర్లు, టీపీవీ రమణి, ప్రధాన కార్యదర్శిగా పీ భాస్కరరావు, కోశాధికారిగా ఎం సురేశ్, జిల్లా కౌన్సిలర్‌లుగా మరో ఎనిమిది మంది మండల కార్యదర్శులుగా 17 మందిని ఎంపిక చేశారు. ఈఎన్నికకు పరిశీలకుడిగా ఏ శ్రీనివాసరావు, పీ రామాంజనేయులు, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ధూళిపాళ్ల శేషగిరి, గాలం వీరాంజనేయులు, అచ్యుత్ మోహన్ వ్యవహరించారు.